# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 023
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
డిసెంబర్ 29, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

గార్లకు చెందిన ఇద్దరు యువతుల దుర్మరణం

## కొలిచిన వారికి కొంగు బంగారం..


8లో..

- శ్రీ సంతోష లక్ష్మీ నరసింహ స్వామి
- న్యూశాయంపేటలో కొండపై స్వయంభూ పట్టాభిషేక రూపం
- నిత్యం భక్తులతో కిటకిట
- 30 న ముక్కోటి ఏకాదశి
- భక్తులకు ఉత్తర ద్వార దర్శనం


2లో..

## మెరిసిన అల్ఫోర్స్ విద్యార్థిని

□ జాతీయస్థాయి కళోత్సవంలో రెండో స్థానం



# మాటలకు చింతకాయలు రాలేనా ?

- అదే ప్రయోగానికి మరోమారు సిద్ధమైన కేసీఆర్
- మళ్లీ నీటి రాజకీయానికి శ్రీకారం
- మహబూబ్‌నగర్ కు అన్యాయం చేస్తున్నారంటూ కొత్త పల్లవి
- చంద్రబాబుతో కుమ్మక్కంటూ ఆరోపణలు
- తానే స్వయంగా రంగంలోకి దిగుతున్నట్లు ప్రకటన



వివరాలు2లో..

మాటలకు చింతకాయలు రాలుతాయా అంటే.. రాలుతాయనే అంటారు మాజీ సీఎం కేసీఆర్. ఎందుకంటే ఆయన మాటలతోనే పదేళ్లపాటు ఓట్లు రాల్చుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రయోగానికి సిద్ధం అవుతున్నారు. రెండేళ్లుగా ఫామ్ హౌజ్‌కే పరిమితమైన ఆయన ఇకపై తోలు తీయడానికి తానే స్వయంగా రంగంలోకి దిగబోతున్నట్టు ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. తెలంగాణపై బీఆర్‌ఎస్‌కు మాత్రమే పేటెంట్ ఉన్నట్లుగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారు. ఇంతకాలం విపక్షనేతగా విఫలమైన కేసీఆర్ ఉన్నట్టుండి కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను రేవంత్‌రెడ్డి వదులుకోవడానికి సిద్ధపడడం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారంటూ సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. చంద్రబాబుతో కుమ్మక్కై రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు ద్రోహం చేస్తున్నారని కేసీఆర్ వాదన మొదలు పెట్టారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు రాజకీయంగా అవసరం వచ్చినప్పుడల్లా చంద్రబాబు బూచి చూపడం కేసీఆర్‌కు అలవాటుగా మారింది. ప్రజల్లో సెంటిమెంటును రగిలించడానికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించారు. అయితే ఏ విషయమైనా అసెంబ్లీలోనే తేల్చుకుందాం రా.. అంటూ సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కు సై అంటూ బీఆర్‌ఎస్ నేతలు ప్రకటించారు. ఇక అసెంబ్లీ రణరంగమే అని అందరూ భావించారు. అయితే కేసీఆర్ ఇలా వచ్చి.. అలా వెళ్లడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, డిసెంబర్ 29, 2025

# మాటలకు చింతకాయలు రాలేనా ?







- అదే ప్రయోగానికి మరోమారు సిద్ధమైన కేసీఆర్
- మళ్లీ నీటి రాజకీయానికి శ్రీకారం
- మహబూబ్‌నగర్ కు అన్యాయం చేస్తున్నారంటూ కొత్త పల్లవి
- చంద్రబాబుతో కుమ్మక్కంటూ ఆరోపణలు
  తానే స్వయంగా రంగంలోకి దిగుతున్నట్లు ప్రకటన

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రెండేళ్లుగా ఫామ్ హౌజ్‌కే పరిమితమైన మాజీ సీఎం కేసీఆర్ ఇకపై తోలు తీయడానికి తానే స్వయంగా రంగంలోకి దిగబోతున్నట్టు ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఉన్నట్టుండి రాష్ట్ర రాజకీయాలలో తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ ప్రయత్నించడం కేవలం రాజకీయంగా మళ్లీ పట్టు సాధించేందుకే తప్ప మరోటి కాదన్న విమర్శలున్నాయి. మళ్లీ నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ నినదిస్తానని ప్రకటించడం దివాళాకోరు తనానికి పరాకాష్ఠ అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్ల తరవాత ఇంకా తెలంగాణ సెంటిమెంట్‌తో ఆడుకుంటానంటూ కేసీఆర్ పావులు కదుపుతున్నారు. తెలంగాణపై బీఆర్‌ఎస్‌కు మాత్రమే పెటెంట్ ఉన్నట్లుగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారు.

### పాపాల మాటేంటి..

తమ హయాంలో పదేళ్ల మోసాలపై మాత్రం మాట్లాడడం లేదు. తోలు తీయడానికి ముందు గత తొమ్మిది ఏళ్ల పాపాల గురించి ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పి ఉంటే హుందాగా ఉండేది. ధరణి, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలు, ఇ-కార్ రేసింగ్ తదితర అక్రమాలకు చెందిన కేసులు చాలానే ఉన్నాయి. వీటికి సమాధానం చెప్పడం లేదు. పైగా కేసీఆర్ కొడుకు లొట్టపీసు కేసులని బెదిరింపులకు దిగారు. ఏతావాతా రాజకీయ నేతల భాష జుగుప్సాకరంగా మారింది. ఇదంతా కేవలం రాజకీయ డ్రామా అని ప్రజలకు కూడా తెలుసు.

### వరుస ఓటములు..

ఇప్పటి వరకు ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము అధికారంలోకి వచ్చినట్టేనని బీఆర్‌ఎస్ నాయకులు కలలుకంటూ వచ్చారు. వరుస ఓటములతో బీఆర్‌ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓటమితో పాటు, పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యం చాటింది. దీంతో ఇక కేటీఆర్‌తో లాభం లేదనుకున్నాడేమో.. కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతానని ప్రకటించారు. గతకొంతకాలంగా బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులు ఇదే ప్రకటిస్తూ వస్తున్నారు.

నిగ్గుతేల్చాలంటున్న కవిత..

మరోవైపు కేసీఆర్ కూతురు కవిత జనంజాగృతి బాటతో బీఆర్‌ఎస్ నాటి పాలనా వైఫల్యాలను తూర్పారబడుతున్నారు. ఆనాడు జరిగిన తప్పిదాలకు క్షమాపణలు కోరుతున్నారు. అభివృద్ధి, బంగారు తెలంగాణ పేరుతో జరిగిన ప్రచారమంతా డొల్ల అని ఆమె కళ్లముందే ఆవిష్కరిస్తున్నారు.

### అసెంబ్లీకి రా..

గత ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. అధికారం కోల్పోయాక జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం, సర్పంచ్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించడంతో సీఎం రేవంత్ రెడ్డి రెట్టించిన ఉత్సాహంతో కేసీఆర్‌పై విరుచుకు పడుతున్నారు. అసెంబ్లీకి రా.. తేల్చుకుందామని, చర్చిద్దామని సవాళ్లు విసరుతున్నారు.

### మహబూబ్‌నగర్ కు అన్యాయం..

ఇప్పుడు కూడా మౌనంగా ఉంటే బాగుండదనో ఏమో కేసీఆర్ ..సై అంటూ సవాళ్లు విసిరారు. అందుకే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను రేవంత్‌రెడ్డి వదులుకోవడానికి సిద్ధపడడం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. చంద్రబాబుతో కుమ్మక్కై రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు ద్రోహం చేస్తున్నారని కేసీఆర్ వాదన మొదలు పెట్టారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు రాజకీయంగా అవసరం వచ్చినప్పుడల్లా చంద్రబాబు బూచి చూపడం కేసీఆర్‌కు అలవాటుగా మారింది. 2018లో చంద్రబాబును బూచిగా చూపించి బొడ్డులో కత్తిపెట్టుకుని తిరుగుతున్నాడని ప్రచారం చేశారు. కేసీఆర్ ప్రచారం ఫలించి రెండో పర్యాయం అధికారంలోకి వచ్చారు. 2023 ఎన్నికల్లో అది పనిచేయలేదు. దీంతో ఇప్పుడు నీళ్ల విషయంలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు, ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని కొత్త పల్లవితో సభలు పెట్టేందుకు సిద్ధం అయ్యారు.

### సెంటిమెంట్ కుట్ర..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ వాసి అయినందున ఆయన తన సొంత జిల్లాకు అన్యాయం చేసుకుంటారని ఎవ్వరు కూడా అనుకోరు. చంద్రబాబుతో కుమ్మక్కు అవుతారనడానికి ఆధారాలు లేవు. ఏ రాజకీయ నాయకుడైనా సొంత ప్రాంత ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలు చేస్తారని అనుకోవడానికి లేదు. అందులోనూ కేసీఆర్‌ను ఇక అధికారంలోకి రానివ్వనని శపథం కూడా చేశారు. పాలమూరు రంగారెడ్డిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అందుకేనేమో కేసీఆర్ కూడా ప్రస్తుతానికి ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారు. నీటి అంశాలపై ప్రజలు వెంటన స్పందిస్తారని అనుకుని ఉంటారు. ప్రజల్లో సెంటిమెంటును రగిలించడానికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించారు.

### రేవంత్ రెడ్డిపై కుట్ర..

తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఫ్యూచర్ సిటీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైజింగ్ సమ్మిట్ నిర్వహించడాన్ని ఎగతాళి చేశారు. నిజానికి తాను ద్వేషించే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని జీర్ణించుకోలేకనే రెండేళ్లుగా ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు. అసెంబ్లీకి కూడా రాకుండా పోయారు. తన దృష్టిలో అల్పుడైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం కేసీఆర్ సహా బీఆర్‌ఎస్ శ్రేణులకు ఇప్పటికీ మింగుడు పడడం లేదు. దీనికితోడు సొంతంగా వ్యూహాలతో కాంగ్రెస్‌కు బలం చేకూరుస్తున్నారు. రాజకీయంగా తాను చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి కేసీఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పొరపాట్లను గుర్తించి సరిదిద్దుకుంటారని అనుకుంటే అలా జరగడం లేదు. అందుకే ప్రజలను మోసం చేసి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని ప్రచారం చేస్తున్నారు. ఉద్యమ సమయంలో ప్రజల్లో ఉండే భావోద్వేగాలు ఎల్లకాలం ఉంటాయని ఇంకా కేసీఆర్ నమ్ముతున్నారు. అందుకే కృష్ణాజలాల పేరుతో రాజకీయానికి పావులు కదుపుతున్నారు. రాజకీయాల్లో అతిశయంతో పనిచేస్తే ఓటమి తప్పదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులుగా విస్మరించారు. ఇప్పుడు ప్రజలకోసం అని బయలుదేరితే ప్రజలు నమ్ముతారని అనుకోవడం కేసీఆర్ మూర్ఖత్వమే అవుతుంది.

# సీఎం మాట నిలబెట్టుకో..

- అసైన్డ్ భూములపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- ఏబీఎస్ అధ్యక్షుడు కలకోటి మహేందర్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** తెలంగాణ రాష్ట్ర శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లోనే అసైన్డ్ భూములపై కీలక నిర్ణయం తీసుకోవాలని ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 'వరంగల్ రైతు డిక్లరేషన్'ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి అసైన్డ్ భూములకు సాగుదారులకే సంపూర్ణ హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఆ హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. తక్షణమే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములపై ఆధారపడి బతుకుతున్న లక్షలాది మంది రైతుల ప్రయోజనాల దృష్ట్యా, జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని నిలదీయాలని మహేందర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, కంటెస్టెడ్ ఎంపీపీ పెరుమాండ్ల చక్రపాణి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నేరెళ్ల బస్వారెడ్డి, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పోగుల యాదగిరి, ఏబీఎస్ ప్రతినిధులు బందెల ఎల్లమ్మ, కుక్క ముడి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# మెరిసిన అల్ఫోర్స్ విద్యార్థిని

- జాతీయస్థాయి కళోత్సవంలో రెండో స్థానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థులకు కళల పట్ల అవగాహన కల్పించడంతోపాటు వాటిలో పాల్గొనేలా ప్రోత్సాహం అందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి సూచించారు. స్థానిక కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీలో గల ఆల్ఫోర్స్ ఐఐటి, నీట్ అకాడమీలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ కళలపట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వాటిలో పాల్గొనేలా ప్రోత్సాహం అందించడంతోపాటు కావలసినటువంటి వనరులను సమకూర్చినట్లైతే వారు వివిధ రంగాల్లో రాణిస్తారన్నారు. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కళోత్సవ్ పోటీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కళాశాలకు చెందిన కె.మైత్రి తేజల్ అత్యుత్తమ ప్రదర్శన కనబరచడమే కాకుండా జాతీయస్థాయిలో రెండో బహుమతిని కైవసం చేసుకున్నారు. దీంతో కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మైత్రి తేజల్ ను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెల్దండి సుధాకర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిబద్ధతకు నిలువుటద్దం రౌతు రమేష్ కుమార్

■ ఘనంగా పదవీ విరమణ సన్మానం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** విద్యుత్ శాఖలో హెల్పర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించి, అంకితభావంతో లైన్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి ఎదిగిన రౌతు రమేష్ కుమార్ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల ఆయన పదవీ విరమణ చేసిన సందర్భంగా, ఆదివారం హసన్‌పర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఉద్యోగ, పరపతి సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉద్యోగ సంఘ నాయకులు తంగళ్లపల్లి కుమారస్వామి, లక్ష్మణ్, వెంకటేశం మాట్లాడుతూ.. రమేష్ కుమార్ కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా, గొప్ప సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అని ప్రశంసించారు. గత 33 ఏళ్లుగా విద్యుత్ సంస్థలో క్రమశిక్షణతో పని చేస్తూనే, డీబీఎఫ్ (DBF) రాష్ట్ర అధ్యక్షులుగా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. సాధారణంగా ఉద్యోగులు తమ బాధ్యతలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారని, కానీ రమేష్ కుమార్ సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల విశ్వాసాన్ని, ఆదరణను పొందిన అరుదైన వ్యక్తి అని వారు పేర్కొన్నారు. ఉద్యోగానికి మాత్రమే విరమణ ఉంటుందని, ప్రజాసేవకు కాదని వక్తలు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులోనూ తన అనుభవాన్ని సమాజ హితం కోసం వెచ్చిస్తూ, ప్రజా సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. అనంతరం రమేష్ కుమార్ దంపతులను శాలువాలు, పూలమాలలతో సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. తన సుదీర్ఘ ప్రయాణంలో సహకరించిన తోటి ఉద్యోగులకు, తనకు ఈ అరుదైన గౌరవాన్ని అందించిన సంఘ నాయకులకు రౌతు రమేష్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదానందం, ఓదెలు, ఐలయ్య, బ్రహ్మం, రాజిరెడ్డి, వెంకటేశం, లక్ష్మణ్, కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవాల్లో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆదివారం భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకట్ చొరవతో, రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేకమల్ల వెంకట్ మాట్లాడుతూ.. ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులు అస్వస్థతకు గురికాకుండా, వారికి తక్షణ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతర వంటి రద్దీ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. తన ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో తృప్తినిస్తోందని సర్పంచ్ ఆనందం వ్యక్తం చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ జ్యోతి నేతృత్వంలోని బృందం భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రేణుక, భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు వేణుగోపాల్, శ్రీనివాస్, ఆశ వర్కర్లు శిరీష, స్వాతి పాల్గొన్నారు. అలాగే ఉపసర్పంచ్ బొట్ల శ్యామల, మాజీ విద్యా కమిటీ చైర్మన్ గడ్డే సత్యనారాయణ, గ్రామ ప్రముఖులు హాజరై వైద్య శిబిరం విజయవంతానికి సహకరించారు.

# స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల :** నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే పేదరికాన్ని జయించవచ్చని టీపీసీసీ ఎస్సీ విభాగం వైస్-చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మడికొండ సంపత్ కుమార్ అన్నారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో గల సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వారు సొంత ఖర్చులతో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మడికొండ సోదరులు మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యశుద్ధితో చదువుకోవాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో తమ వంతు సాయంగా బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవడం ద్వారా జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. పేద విద్యార్థుల పట్ల మడికొండ సోదరులు చూపుతున్న ఈ ఉదారత అభినందనీయమని పాఠశాల హెడ్మాస్టర్ ఏబ్బి మేడం కొనియాడారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించి వారిలో ఉత్సాహాన్ని నింపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మడికొండ ఐలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇటుక బట్టీ కార్మికులను ఆదుకోవాలి


◆ ఐఎఫ్టీయూ నాయకుల డిమాండ్

◆ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లావ్యాప్తంగా ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా నాయకత్వం డిమాండ్ చేసింది. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జిల్లా నాయకులు మాట్లాడుతూ.. నల్లబెల్లి, దుగ్గొండి, చెన్నారావుపేట, గీసుకొండ, నెక్కొండ, ఖానాపురం మండలాలతో పాటు నగర శివారులోని పైడిపల్లి, దేశాయిపేట, నక్కలపల్లి ప్రాంతాల్లోని ఇటుక బట్టీల్లో కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. కార్మికులు రోజుకు 15 నుంచి 20 గంటల వరకు కష్టపడుతున్నా, వారికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని, యజమానులు వారిని వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని మండిపడ్డారు. ఇటుక బట్టీల్లో నిబంధనలకు విరుద్ధంగా మైనర్ బాలబాలికలతో పనులు చేయిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులకు ఎలాంటి బీమా సౌకర్యం లేదని, రక్షణ పరికరాలు కూడా కల్పించడం లేదని పేర్కొన్నారు. కార్మిక శాఖ అధికారులు ఇటుక బట్టీలను సందర్శించి కార్మిక చట్టాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టాలను బేఖాతరు చేస్తున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, జిల్లా నాయకులు మహమ్మద్ ఖాన్, నగర అధ్యక్షులు బన్న నర్సింగం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చెరువు కొమ్ము తండాలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పెంకుటిల్లు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో బాధితుడు బానోత్ జనార్ధన్ కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బానోత్ జనార్ధన్ కుటుంబ సభ్యులు ఉదయం తమ దైనందిన పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లోని మెయిన్ వైర్ వద్ద ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు అంటుకున్నాయి. పెంకుటిల్లు కావడంతో మంటలు క్షణాల్లో ఇల్లంతా వ్యాపించాయి. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసేలోపే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో భద్రపరుచుకున్న సుమారు 2 క్వింటాళ్ల బియ్యం, వెండి, బంగారు ఆభరణాలు, ముఖ్యమైన ధృవపత్రాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు 1 లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. జనార్ధన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని తమ పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** విదేశీ విద్యారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆడెపు ఓవర్సీస్ సంస్థ రూపొందించిన 2026 నూతన క్యాలెండర్‌ను ప్రముఖులు ఘనంగా ఆవిష్కరించారు. వరంగల్ చౌరస్తాలోని కె కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకకు రాజకీయ, వ్యాపార, విద్యా రంగాలకు చెందిన ప్రముఖులు భారీగా తరలివచ్చారు. క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. యువత విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి దేశ కీర్తిని చాటేలా ఆడెపు ఓవర్సీస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులకు సరైన దిశానిర్దేశం చేయడం, పారదర్శకమైన సేవలు అందించడమే ఈ సంస్థపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరికిపండ్ల నరహరి (ఐఏఎస్), బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, బీజేపీ నాయకులు వన్నాల వెంకటరమణ, బీజేపీ అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, బేతి అశోక్, ఇతర ప్రముఖులు పాల్గొని సంస్థ సాధిస్తున్న పురోగతిని ప్రశంసించారు.

# కేయూలో ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



**వరంగల్ వాయిస్, కేయూ :** యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో వరంగల్ జోన్ ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమైంది. స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ప్రొ. వై.వెంకయ్య క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచి వరంగల్ జోన్ టీంకు, తద్వారా కాకతీయ యూనివర్సిటీ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభాను రావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డా.పి.భాస్కర్, పీడీలు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ వేడుకల వేళ.. నిర్లక్ష్యం వహిస్తే విషాదమే..



నూతన సంవత్సరం అనగానే కొత్త ఆశలు, ఆశయాలు, ఉజ్వల భవిష్యత్తుకు ఆరంభం గుర్తుకొస్తాయి. కాలచక్రంలో మరో ఏడాది మారుతున్న వేళ పాత చేదు జ్ఞాపకాలను నెట్టేసి, కొత్త వెలుగుల వైపు అడుగులు వేయాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తారు. అయితే, ఈ ఆనందం క్షణికమైన మద్యం మత్తులో, వేగపు నిర్లక్ష్యంలో చిక్కుకుని విషాదాంతంగా మారకూడదు. ఏటా కొత్త ఏడాది వేడుకల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మన సమాజానికి గట్టి హెచ్చరికలు పంపుతున్నాయి. ముఖ్యంగా యువత ఉత్సాహంలో చేసే చిన్న తప్పులు తీరని నష్టాన్ని మిగిలిస్తున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎంతోమంది తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పోతున్నారు. మరికొందరు ప్రాణాలతో బయటపడినా, శాశ్వత అంగవైకల్యంతో జీవితాంతం నరకాన్ని అనుభవిస్తున్నారు. ఒక్క రాత్రి సరదా.. కన్నవారికి కడుపు కోతను, భార్యాపిల్లలకు అనాథత్వాన్ని మిగిల్చుతోంది. ఒక క్షణపు నిర్లక్ష్యం ఎన్నో కుటుంబాలకు శాశ్వత శిక్షగా మారుతోంది. ఈ నేపథ్యంలో పోలీసు విభాగం ఇస్తున్న హెచ్చరికలను ప్రతి పౌరుడు గమనించాలి. "మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదు" అనే కఠినమైన ఆదేశాలు ఎవరినో శిక్షించడానికి కాదు——ప్రతి ఒక్కరి ప్రాణాలను రక్షించడానికే అని గుర్తించాలి. చట్టం అనేది కేవలం భయపెట్టే సాధనం కాదు, అది మన బాధ్యతను గుర్తుచేసే కవచం.

## అసలైన వేడుక అంటే ఏమిటి?

నూతన సంవత్సర వేడుకలు అంటే రోడ్లపై పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్లడం కాదు. మద్యం మత్తులో స్టీరింగ్ పట్టడం సంబరం అనిపించుకోదు. ప్రమాదకరంగా సెల్ఫీలు తీసుకుంటూ ప్రాణాలను ఆహ్వానించడం వీరత్వం కాదు. నిజమైన వేడుక అంటే.. వేడుక ముగిశాక సురక్షితంగా ఇంటికి చేరడం. తన కోసం వాకిలి వద్ద ఎదురుచూసే తల్లిదండ్రుల కళ్ళలో ఆనందాన్ని చూడటం. కుటుంబంతో కలిసి నవ్వడం, రేపటి ఉజ్వల భవిష్యత్తుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం.

## యువత ఆలోచించాలి!

రేపటి తరం ఒక్కసారి ఆలోచించాలి. మీపై ఆశలు పెట్టుకున్న కుటుంబ సభ్యులు, మీ విజయాన్ని చూడాలనుకునే మిత్రులు ఉన్నారు. మీ జీవితం కేవలం మీది మాత్రమే కాదు, అది మీ కుటుంబ భవిష్యత్తుతో ముడిపడి ఉంది. మీ ఒక్క తప్పు నిర్ణయం ఎందరినో అగాధంలోకి నెట్టేస్తుంది. నూతన సంవత్సరం నిజంగా మీ జీవితంలో కొత్త వెలుగులు నింపాలంటే.. 'మద్యం – వాహనం' మధ్య గట్టి గీత గీయండి. బాధ్యతే నిజమైన ఆనందం అని గ్రహించండి. ప్రాణం ఉన్నప్పుడే మనం ఏదైనా సాధించగలం. ఆ ప్రాణమే అతిపెద్ద వేడుక.

వ్యాసకర్త
నిమ్మల శ్రీనివాస్, సామాజికవేత్త
సెల్: 99497 09866



# ఘనంగా 'జీటీఏ' సమ్మేళనం

- ప్రారంభించిన త్రిదండి చిన్నజీయర్ స్వామి
- జీటీఏ జనగామ జిల్లా అధ్యక్షుడిగా వైద్యం రాజగోపాల్ ఎన్నిక
- 43 దేశాల ప్రతినిధుల సమక్షంలో కొత్త కార్యవర్గం ప్రకటన




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నగరంలోని అక్షయ్ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన 'గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్' (జీటీఏ) మొదటి మెగా సమ్మేళనం అత్యంత వైభవంగా ముగిసింది. 43 దేశాలకు చెందిన ఎన్ఆర్ఐ ప్రతినిధులు హాజరైన ఈ వేడుకల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడ్డాయి. సమావేశాల మొదటి రోజున శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రవాసంలో ఉన్నా మాతృభూమిపై మమకారంతో తెలంగాణా అభివృద్ధికి తోడ్పడుతున్న ప్రతినిధులను ఆశీర్వదించారు. సదస్సులో భాగంగా జనగామ జిల్లా జీటీఏ చాప్టర్‌ను అధికారికంగా ప్రకటించారు. జీటీఏ అధ్యక్షులు మల్లారెడ్డి అలుమల్ల, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి ముంద్రాతి రాము (వాషింగ్టన్ డీసీ అధ్యక్షులు) నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జనగామ జిల్లా నూతన కార్యవర్గంలో ప్రధాన సలహాదారుగా పెండ్యాల ప్రతాపరెడ్డి, అధ్యక్షుడిగా వైద్యం రాజగోపాల్, ఉపాధ్యక్షుడిగా డా.దూలం ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా లయన్ కృష్ణ జీవన్ బజాజ్, కోశాధికారిగా కొక్కుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా డా.వైద్యం గౌతమ్ లు ఎన్నికయ్యారు. రెండవ రోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఉర్రూతలూగించాయి. ప్రముఖ ఫోక్ సింగర్ మంగ్లీ తన గళంతో సమ్మేళనాన్ని మంత్రముగ్ధులను చేశారు. ఆటపాటలు, తెలంగాణ జానపద కళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ మెగా ఈవెంట్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు తదితరులు హాజరై ప్రసంగించారు. గ్లోబల్ వేదికపై తెలంగాణ ఖ్యాతిని చాటుతున్న ఎన్ఆర్ఐల కృషిని వారు అభినందించారు.

# కేయూలో 'వీర్ బాల్ దివస్' పోస్టర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, కేయూ :** దేశం, ధర్మం కోసం కేవలం 7 ఏళ్ల ప్రాయంలోనే ప్రాణాలర్పించిన జోరావర్ సింగ్, ఫతే సింగ్‌ల త్యాగాలను స్మరిస్తూ జనవరి 3న 'వీర్ బాల్ దివస్' నిర్వహిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొ.వి.రామచంద్రం తెలిపారు. సోమవారం వర్సిటీలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో జాతీయతా భావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొ.మామిడాల ఇస్తారి, సోషాలజీ విభాగాధిపతి డా.ఎం.స్వర్ణలత మాట్లాడుతూ.. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 'జాతి నిర్మాణానికి స్ఫూర్తి' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల అనుబంధ కళాశాల విద్యార్థులు జనవరి 2లోపు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.



# గ్రంథాలయం ఒక దేవాలయం



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** "గ్రంథాలయం ఒక దేవాలయం అయితే, గ్రంథ పాలకుడు పూజారి వంటివాడు" అని కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్.వాసుదేవ రెడ్డి అభివర్ణించారు. కేంద్ర గ్రంథాలయంలో లైబ్రరీ అసిస్టెంట్‌గా సుదీర్ఘ సేవలు అందించి పదవీ విరమణ పొందుతున్న ఇజాక్ ప్రభాకర్ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లైబ్రరీ అసిస్టెంట్ తేజావత్ జావేర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధిలో గ్రంథాలయాలు కీలక వారధి అని, ఇజాక్ ప్రభాకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం అధికారుల సంఘం అధ్యక్షురాలు డా.ఎస్.సుజాతతో కలిసి ఇజాక్ ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు.

# బార్ కౌన్సిల్ ఎన్నికల బరిలో అల్లం నాగరాజు

◆ ఘనంగా నామినేషన్ దాఖలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం అల్లం నాగరాజు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. హైదరాబాద్‌లోని బార్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ కార్యదర్శి నాగలక్ష్మికి ఆయన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ మరియు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సీనియర్ న్యాయవాదులు ఆయనకు మద్దతు తెలిపారు. నామినేషన్ దాఖలు అనంతరం అల్లం నాగరాజు మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉందని, నిబద్ధతతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తన ప్రధాన లక్ష్యాలను ఈ సందర్భంగా వివరించారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు రక్షణ చట్టం పటిష్ట అమలుకు కృషి. న్యాయవాదులందరికీ మెరుగైన హెల్త్ పాలసీ కల్పించడం. జూనియర్ న్యాయవాదులకు గౌరవప్రదమైన స్టైఫండ్, సీనియర్ న్యాయవాదులకు పెన్షన్ సౌకర్యం కల్పించడం. బార్ అసోసియేషన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించడం. న్యాయవాద కుటుంబ సభ్యునిగా తనను ఆదరించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అల్లం నాగరాజు కోరారు. న్యాయవాదుల హక్కుల కోసం తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా మాజీ బార్ ప్రెసిడెంట్ ఏలుకుర్తి ఆనంద్ మోహన్, మాజీ బార్ కౌన్సిల్ సభ్యులు సిరికొండ సంజీవరావు, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, కె.సి. రాజు, పూజారి నాగేశ్వర రావు , సందసాని ప్రసాద్, శామంతుల శ్రీనివాస్, శేర్ల అనిల్, గంద్రతి శ్రీధర్, బొమ్మ నాగరాజు, ఉప్పరి శంకర్, అర్షం రాంబాబు, అల్లం రాజేష్ వర్మ హరీశ్, సతీశ్, దిడ్డి రాజు, పాల్గొన్నారు. మహిళా న్యాయవాదులు మౌనిక, హిమబిందు, రాధికా, లావణ్య, రజని, సావిత్రి, రమ్య, లక్ష్మి, రేవతి, కవిత తదితరులు హాజరై మద్దతు పలికారు.

# అభివృద్ధిలో రాజకీయాలకు తావుండకూడదు



**వరంగల్ వాయిస్, పరకాల :** ఎన్నికల ఘట్టం ముగిసిన తర్వాత ఏర్పడిన నూతన పాలకవర్గం రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని పరకాల మాజీ ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు హితవు పలికారు. పరకాల మండల పరిధిలోని పోచారం, మల్లక్కపేట గ్రామాలకు ప్రత్యేక అధికారిగా వ్యవహరించిన ఆయన, ఆయా గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు మరియు వార్డు సభ్యులను సోమవారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పార్టీలు, విభేదాలను పక్కన పెట్టి ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. సన్మానం పొందిన వారిలో పోచారం, మల్లక్కపేట గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ఉన్నారు. తమపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సుమలతతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# హోరెత్తిన బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

■ పెండింగ్ డిమాండ్లు తీర్చాలని డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తమ న్యాయమైన హక్కుల సాధన కోసం బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగులు గళమెత్తారు. తెలంగాణ బ్యాంక్ రిటైరీ ఫెడరేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ నగరంలోని పోచమ్మ సెంటర్లో భారీ ధర్నా నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా రిటైర్డ్ బ్యాంకర్లు ఈ నిరసనలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, ఐబీఏకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్టేట్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, ఎం.వీ.రమణ, వరంగల్ జిల్లా అధ్యక్షులు మదూరి గణేష్ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా పెన్షన్ రివిజన్ కోసం పోరాడుతున్నా కేంద్ర ఆర్థిక శాఖ, ఐబీఏ మొండివైఖరి ప్రదర్శిస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చినా స్పందన కరువైందని, అందుకే దేశవ్యాప్త పిలుపులో భాగంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే బ్యాంక్ రిటైరీలకు తక్షణమే పెన్షన్ రివిజన్ చేపట్టాలి. ఆరోగ్య బీమా ప్రీమియంపై విధిస్తున్న GSTని వెంటనే రద్దు చేయాలి. బ్యాంక్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ పథకాన్ని వర్తింపజేయాలి. ప్రైవేట్ బ్యాంక్ రిటైరీలకు కూడా ఎక్స్-గ్రేషియా చెల్లించాలి. రిటైరీ సంఘాలతో ఐబీఏ నేరుగా చర్చలు జరపాలి. స్పెషల్ అలవెన్సులను పెన్షన్ పరిధిలోకి తీసుకురావాలి. పెన్షన్ రివిజన్ జరిగే వరకు తమ పోరాటం ఆగదని, కేంద్రం దిగి రాకపోతే జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ లోని 17 బ్యాంకుల ప్రతినిధులు కరుణాకర్, సత్యం, కమలాకర్, మనోహర్, సోమ శ్రావణ్, ప్రభాకర్, కామేశ్వరరావు, యాదగిరి, టి. వెంకటేశ్వర్లు, జి. విద్యాసాగర్, రవిబాబు, గోపాల్ రెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్రీడలతోనే క్రమశిక్షణ, సత్ప్రవర్తన



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** యువత శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందేందుకు, క్రమశిక్షణతో కూడిన సత్ప్రవర్తనను అలవర్చుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ధర్మసాగర్ ఎస్సై దిలీప్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 'మేరా యువ భారత్' వరంగల్ కేంద్రం ఆధ్వర్యంలో ధర్మసాగర్, వేలేరు మండలాల స్థాయి క్రీడా పోటీలను (బ్లాక్ లెవెల్ మీట్) ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ధర్మసాగర్ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై దిలీప్ మాట్లాడుతూ.. నేటి తరం యువత సులభంగా చెడు వ్యసనాల వైపు ఆకర్షితులవుతూ తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఒత్తిడి తగ్గి, సన్మార్గంలో ప్రయాణించే ప్రేరణ కలుగుతుందని తెలిపారు. యువశక్తి సమాజ నిర్మాణానికి ఉపయోగపడా లే తప్ప, విధ్వంసానికి కాదని హితవు పలికారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు పూర్వం పాటించిన క్రమశిక్షణ పద్ధతులను మళ్లీ అనుసరించాలని ఎస్సై సూచించారు. చిన్నతనం నుంచే పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, అవసరమైతే మందలించి వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. పెద్దల పట్ల గౌరవభావం, క్రమశిక్షణ కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ వలంటీర్లు మంద రాజేష్, ఈసంపల్లి రమేష్, పీడీ శ్రీనాథ్, కళాశాల అధ్యాపకులు ప్రభాకర్, భాస్కర్, గణేష్, వేణు, గోపాలకృష్ణ, బాబురావు, మంజుల, రవళి, వివిధ యువజన సంఘాల సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లపై పార్టీల వైఖరి ప్రకటించాలి



**వరంగల్ వాయిస్, సుబేదారి :** రాబోయే జిల్లా, మండల ప్రాదేశిక (జడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలు తమ స్పష్టమైన వైఖరిని ఎన్నికలకు ముందే ప్రకటించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అధ్యక్షులకు రాసిన లేఖలను విడుదల చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన రాజకీయ పార్టీలు, తీరా ఎన్నికల సమయంలో మాట తప్పి బీసీలను మోసం చేశాయని డాక్టర్ శేషు విమర్శించారు. దీని ఫలితంగానే రాష్ట్రంలో బీసీలు కేవలం 38.9 శాతం (4,946) పంచాయతీలను మాత్రమే గెలుచుకోగలిగారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అవకాశం లేకపోయినా, పార్టీ పరంగా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 237 జెడ్పీటీసీ స్థానాలను, 2,424 ఎంపీటీసీ స్థానాలను బీసీ అభ్యర్థులకే కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కుతున్న పార్టీలు, సీట్ల కేటాయింపులో మాత్రం అన్యాయం చేస్తున్నాయని, ఈసారి బీసీలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ధారబోయిన సతీష్, బుట్టి శ్యామ్ యాదవ్, డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్, డాక్టర్ పాలడుగుల సురేందర్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడి తండ్రి అంత్యక్రియలకు గ్రామమే దిక్కు

◆ కన్నీటి పర్యంతమైన గుండేడు
◆ మానవత్వం చాటుకున్న గ్రామస్తులు

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** ఆ నిరుపేద కుటుంబంలో విషాదం నిండింది. కన్నతండ్రి మరణం ఒక ఎత్తైతే, కనీసం అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కూడా చిల్లిగవ్వ లేని దుస్థితి ఆ వికలాంగ కుమారుడిని ఉక్కిరిబిక్కిరి చేసింది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడు గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను కలచివేసింది. గ్రామానికి చెందిన జక్కుల వెంకటయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల కన్నుమూశారు. ఆయన కుమారుడు జక్కుల విజేందర్ పుట్టుకతోనే వికలాంగుడు. తండ్రి మరణంతో విజేందర్ జీవితం ఒక్కసారిగా అంధకారమైంది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడమే కాకుండా, అంత్యక్రియలకు సైతం ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆ యువకుడు పడిన ఆవేదన వర్ణనాతీతం. విజేందర్ దీనస్థితిని గమనించిన గుండేడు గ్రామస్తులు అండగా నిలిచారు. మానవత్వాన్ని చాటుకుంటూ తమ వంతుగా చందాలు సేకరించి, జక్కుల వెంకటయ్య అంతిమ సంస్కారాలను గౌరవప్రదంగా నిర్వహించారు. తండ్రి చితి ముందు నిలబడి విజేందర్ విలపించిన తీరు అక్కడి వారిని కన్నీరు పెట్టించింది. "నా తండ్రి చివరి ప్రయాణానికైనా గౌరవం దక్కేలా చేసిన గ్రామస్తులకు రుణపడి ఉంటాను" అంటూ విజేందర్ కన్నీటితో కృతజ్ఞతలు తెలిపాడు.



పేదరికం, వికలాంగత్వంతో పోరాడుతున్న ఇలాంటి అభాగ్యులను ప్రభుత్వం గుర్తించి, తక్షణమే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

# వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి పద్మశాలికి సన్మానం



**వరంగల్ వాయిస్, వేలేరు :** వేలేరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన బిల్లా యాదగిరి పద్మశాలిని పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం మండల కేంద్రంలో వేలేరు మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాస్ అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హన్మకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ చంద మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ యాదగిరిని శాలువాలు, పూలమాలలతో సత్కరించిన అనంతరం చంద మల్లయ్య మాట్లాడుతూ.. పద్మశాలి సామాజిక వర్గం నుంచి సర్పంచ్‌గా ఎన్నిక కావడం గర్వకారణమని, పదవిని బాధ్యతగా భావించి గ్రామ ప్రగతికి బాటలు వేయాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన పోపా సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. సర్పంచ్ తన అనుభవంతో వేలేరు గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాసికంటి రాజేంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బింగి శ్రీనివాస్, రిటైర్డ్ సీహెచ్ఓ డాక్టర్ గంజి మురళీధర్ ప్రసంగించారు. వేలేరు గ్రామం నుండే కాకుండా శాయంపేట, ధర్మసాగర్ మండలాల నుంచి కూడా పద్మశాలి ప్రతినిధులు తరలివచ్చి యాదగిరికి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ కూరపాటి రమేష్, గ్రామ అధ్యక్షుడు కూరపాటి ప్రభాకర్, మండల మాజీ సర్పంచ్ బిల్లా వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి రాజు పాల్గొన్నారు. అలాగే వేలేరు పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షులు మార్కండేయ, ప్రధాన కార్యదర్శి రవి, మహిళా కార్యదర్శి బిల్లా విజయ, పరపతి సంఘ సభ్యులు కలిపి సుమారు 200 మంది పాల్గొన్నారు.

# 'సెల్ట్' శిక్షణ ముగింపు వేడుకలు

## 31న సర్టిఫికెట్ల ప్రధానోత్సవం

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం 'సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్' ఆధ్వర్యంలో నిర్వహించిన 6 వారాల ఆంగ్ల భాషా శిక్షణ తరగతులు ముగిశాయి. దీని ముగింపు సమావేశాన్ని ఈనెల 31న మధ్యాహ్నం 12 గంటలకు ఇంగ్లీష్ విభాగ సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డా.ఆర్.మేఘనా రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉన్నతాధికారులు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తారని, శిక్షణ పొందిన విద్యార్థులందరూ విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

# లయన్ వెంకట సుబ్బయ్యకు బెస్ట్ క్లబ్ అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజ సేవలో తనదైన ముద్ర వేస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న హనుమకొండ రాయల్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ దీటి వెంకట సుబ్బయ్యను జిల్లా స్థాయి 'బెస్ట్ క్లబ్' అవార్డు వరించింది. లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి గాను హనుమకొండ రాయల్స్ క్లబ్‌ను అత్యుత్తమ క్లబ్‌గా ఎంపిక చేశారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షుడి హోదాలో వెంకట సుబ్బయ్య ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. వెంకట సుబ్బయ్య తన క్లబ్ ద్వారా విశిష్ట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆభాగ్యుల పాలిట పెన్నిధిగా మారారు. సుమారు ఆరు వేల మంది నిరుపేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆకలితో అలమటిస్తున్న ఎందరో పేదలకు ఆహారం అందించి వారి ఆదరణను పొందారు. రియల్ ఎస్టేట్ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వెంకట సుబ్బయ్య, వృత్తితో పాటు సామాజిక బాధ్యతను కూడా అంతే నిబద్ధతతో నిర్వహిస్తున్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నిబంధనల ప్రకారం సేవా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లినందుకు గాను ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, డిసెంబర్ 29, 2025

# గోపాల్‌పూర్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని గోపాల్‌పూర్ క్రాస్ రోడ్ నుంచి గోపాలపురం వెళ్లే ప్రధాన మార్గంలో ట్రాఫిక్ అడ్డంకులను తొలగించేందుకు హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి పర్యవేక్షణలో సోమవారం రోడ్డు ఆక్రమణల తొలగింపుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ మార్గంలో ఇటీవలి కాలంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. అయితే, రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సంస్థలు తమ సైన్ బోర్డులను రోడ్డుపైకి పెట్టడం, అక్రమంగా షెడ్లను నిర్మించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనివల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ అవ్వడమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించిన పోలీసులు, ఆక్రమణలను జేసీబీల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ఆక్రమణల వల్ల సామాన్య ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇకపై రోడ్లపైకి బోర్డులు పెట్టినా, ఆక్రమణలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించకుండా వ్యాపారులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన రామాలయం



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి వేడుకలకు సిద్ధమైంది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకాలు, అలంకరణలు జరగనున్నాయి. శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామితో పాటు సర్వదేవతామూర్తులు భక్తులకు ఉత్తర ద్వారం గుండా దర్శనమివ్వనున్నారు. ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకోవడం అత్యంత పుణ్యప్రదమని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన గౌడ్ మాట్లాడుతూ.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, బటిక స్వామి, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్, దయ్యాల భద్రయ్య, ఉయ్యాల బిక్షపతి, మాదాసు మొగిలి, పాండవుల భద్రయ్య, మోటపోతుల రాజన్న గౌడ్ పాల్గొన్నారు.

# అధికారులను కలిసిన లక్ష్మారెడ్డి పల్లి సర్పంచ్ సంపత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని లక్ష్మారెడ్డి పల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన వీరమల్ల సంపత్ రెడ్డి, ఉపసర్పంచ్ మొగిలి శంకర్ సోమవారం మండలంలోని పలువురు అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామ అభివృద్ధి, ప్రణాళికల విషయంలో అధికారుల సహకారం కోరుతూ ఈ భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో సత్యనారాయణ స్వామి, ఎంపిడివో భాస్కర్, విద్యుత్ శాఖ ఏఈ వెంకటరమణ, గణపురం సీఐ కర్ణాకర్ రావు, అలాగే ఎస్ఐలు అశోక్, అమూల్యలను వారు కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ అశోక్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు కాంతాల సమ్మిరెడ్డి, యూత్ అధ్యక్షులు మామిడాల విజయ్ కుమార్, మేడిపెల్లి శ్రీనివాస్, బండారి రాకేష్, ఇతర గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న నగదు బ్యాగు అప్పగింత

## సీసీ కెమెరాల ఆధారంగా కనిపెట్టిన పోలీసులు




**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** బాధ్యతాయుతమైన విధి నిర్వహణతో పాలకుర్తి పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యలో పొరపాటున పడిపోయిన లక్ష రూపాయల నగదు ఉన్న బ్యాగును కేవలం మూడు రోజుల్లోనే వెతికి పట్టుకుని బాధితుడికి అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. రేగుల గ్రామానికి చెందిన ముత్యం యాకయ్య జనగామ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఆయన తన విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా, మార్గమధ్యలో రూ. 1,02,000 నగదు, ఐడీ కార్డులు, ఇతర విలువైన పత్రాలు కలిగిన బ్యాగును పోగొట్టుకున్నారు. కష్టార్జితం పోవడంతో ఆందోళన చెందిన యాకయ్య, పాలకుర్తి ఎస్సై పవన్ కుమార్‌ను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన ఎస్సై పవన్ కుమార్, ఈ కేసును ఛేదించాలని ఎస్సై లింగారెడ్డి, హోంగార్డు మారయ్యలను ఆదేశించారు. పోలీసులు దర్దేపల్లి గ్రామంలోని సిసి కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. యాకయ్య బైక్‌పై వెళ్తున్న సమయంలో బ్యాగు ఎక్కడ పడిపోయింది, ఆ తర్వాత ఎవరు తీసుకున్నారనే విషయాన్ని కెమెరా ఫుటేజీ ద్వారా చాకచక్యంగా గుర్తించారు. బ్యాగును స్వాధీనం చేసుకున్న పోలీసులు, అందులోని లక్షా రెండు వేల రూపాయల నగదును, పత్రాలను ఎస్సై లింగారెడ్డి చేతుల మీదుగా యాకయ్యకు అప్పగించారు. తన డబ్బు తిరిగి లభించడంతో యాకయ్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన కానిస్టేబుల్ రవి, హోంగార్డు మారయ్యలను ఎస్సైలు పవన్ కుమార్, లింగారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

## దామెర ఎస్ఐ కొంక అశోక్ హెచ్చరిక

## న్యూ ఇయర్ శుభాకాంక్షల ఏపీకే ఫైళ్లను క్లిక్ చేయద్దు



**వరంగల్ వాయిస్, దామెర :** నూతన సంవత్సర వేడుకల వేళ సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ప్రజలను దోచుకునేందుకు సిద్ధమవుతున్నారని దామెర ఎస్ఐ కొంక అశోక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. శుభాకాంక్షల పేరుతో వచ్చే అనుమానాస్పద లింకులు, ఫైళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "Happy New Year Gift APK", "New Year Surprise APK", "Greeting Card APK" వంటి పేర్లతో వాట్సాప్ లేదా ఎస్సెమ్మెస్ ద్వారా ఫైళ్లు వస్తాయి. నియంత్రణ: ఈ APK ఫైళ్లను ఇన్‌స్టాల్ చేస్తే, మీ మొబైల్ ఫోన్ పూర్తి నియంత్రణ సైబర్ మోసగాళ్ల చేతుల్లోకి వెళ్తుంది. మీ ఫోన్‌లోని బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని వారు సులభంగా తస్కరిస్తారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి మాత్రమే యాప్స్ డౌన్‌లోడ్ చేయాలి. తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఏ రకమైన యాప్ ఫైళ్లను ఇన్‌స్టాల్ చేయకూడదు. అలాంటి సందేశాలు రాగానే వెంటనే డిలీట్ చేయాలి. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలి. మీ చిన్న నిర్లక్ష్యం మీ కష్టార్జితాన్ని కరిగించే ప్రమాదం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండి సురక్షితంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఎస్ఐ కోరారు.

# తడక కుమారస్వామి గౌడ్‌కు అంతర్జాతీయ వాకర్స్ అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక గోపాలపురం ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తడక కుమారస్వామి గౌడ్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. వాకర్స్ సభ్యులకు ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా "అంతర్జాతీయ అవార్డు" వరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్వహించిన 34వ అంతర్జాతీయ వాకర్స్ సదస్సులో ఈ పురస్కారాన్ని అందజేశారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో, కుమారస్వామి గౌడ్ వాకర్స్ ఇంటర్నేషనల్ 303 డిస్ట్రిక్ట్‌లో పోషించిన క్రియాశీలక పాత్రను సభ్యులు కొనియాడారు. ఆదివారం జరిగిన ముగింపు వేడుకల్లో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వపు అధ్యక్షులు మురళీ మనోహర్, రామానందం, నాగభూషణం, ప్రభావతిల చేతుల మీదుగా కుమారస్వామి గౌడ్ ఈ అరుదైన అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సభ్యులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ వాసికి అంతర్జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల స్థానిక వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, గోపాలపురం ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.

# చైనా మాంజా అమ్మినా, వాడినా ఏడేళ్ల జైలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా వ్యాప్తంగా నిషేధిత చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా.శబరీష్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ వస్తున్న తరుణంలో గాలిపటాలు ఎగరవేసేందుకు యువత ఉత్సాహం చూపుతున్నారని, అయితే ప్రమాదకరమైన సింథటిక్ దారాలను వాడితే ప్రాణాపాయం సంభవిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింథటిక్ దారం, గాజు పొడితో తయారయ్యే ఈ మాంజా వల్ల ద్విచక్ర వాహనదారుల మెడలు కోసుకుపోయి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గాల్లో ఎగిరే పక్షుల రెక్కలు, మెడలు కోసుకుపోయి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఈ మాంజాకు విద్యుత్ ప్రసరణ గుణం ఉండటం వల్ల కరెంట్ వైర్లకు తగిలితే ప్రాణాపాయం జరిగే అవకాశం ఉంది. నిషేధిత మాంజాను విక్రయించినా లేదా నిల్వ చేసినా ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న దుకాణాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

# అధునాతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి

- తహసీల్దార్‌కు ఏఎస్ఎఫ్ నాయకుల వినతి




**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రంలో నిరుద్యోగులు, విద్యార్థుల సౌకర్యార్థం అన్ని రకాల పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ మరియు ఆధునిక వసతులతో కూడిన నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించాలని అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు గోల్కొండ సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం చిట్యాల మండల తహసీల్దార్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, ప్రస్తుతం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం గ్రామ పంచాయతీలోని ఒక చిన్న గదిలో కొనసాగుతోందని, ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో పాఠకులు భయాందోళనల మధ్య పుస్తక పఠనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే పుస్తకాలు తడిసిపోయే పరిస్థితి ఉందని, తక్షణమే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. నిరుద్యోగులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారని, గ్రంథాలయంలోనే అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరారు. స్మార్ట్ ఫోన్లకు బదులు పుస్తక పఠనం వైపు యువతను మళ్లించేలా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దాలన్నారు. నూతన భవనం పూర్తయ్యే వరకు, ప్రస్తుత గ్రంథాలయాన్ని ఏదైనా సురక్షితమైన భవనంలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని చిట్యాలలో మోడల్ లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వంశీ కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.





## శ్రీవారిని దర్శించుకున్న ఛాంపియన్స్

తిరుమల శ్రీవారిని 'ఛాంపియన్' చిత్ర బృందం దర్శించుకుంది. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో సినిమా హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్.. స్వామివారి సేవలో చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.



## రాజాసాబ్ నుంచి మరో ట్రైలర్ విడుదల

### సంక్రాంతి సినిమాలు హిట్ కావాలన్న ప్రభాస్

ది రాజాసాబ్' విడుదలకు సమయం దగ్గరపడుతోంది. ఈ క్రమంలో చిత్ర బృందం ప్రచారాన్ని వేగవంతం చేస్తోంది. ఇప్పటికే పాటలు, ఓ ట్రైలర్‌ను రిలీజ్ చేసిన టీమ్ తాజాగా మరో ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రభాస్ హీరోగా మారుతి రూపొందించిన ఈ మూవీజనవరి 9న బాక్సాఫీసు ముందుకు రానున్న సంగతి తెలిసిందే. రొమాంటిక్ కామెడీ హారర్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లు.'పదిహేనేళ్ల తర్వాత మళ్లీ పూర్తిస్థాయి వినోదంతో 'ది రాజాసాబ్' చేశాం. ఈ సినిమా విషయంలో చాలా ఆత్రుతగా ఉన్నా. అది కూడా సంక్రాంతికి వస్తోంది. సంక్రాంతి సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ అవ్వాలి. మాది కూడా అయిపోతే మరింత సంతోషం అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ది రాజాసాబ్' విడుదలకు ముందస్తు వేడుక హైదరాబాద్‌లో జరిగింది. మారుతి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్ కథానాయికలు. సంజయ్‌దత్, జరీనా వహాబ్ ముఖ్యపాత్రలు పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి. విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకొస్తోంది.ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో సంజయ్‌దత్ కనిపించిన విధానం అద్భుతం. ఇది నానమ్మ మనవడి కథ. నానమ్మని చూస్తూ నా సన్నివేశాల్ని మరిచిపోయేవాణ్ని. అంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు జరీనా. ఇందులో నాతోపాటు మా నానమ్మకూడా ఓ హీరో. ముగ్గురు అందమైన హీరోయిన్లు ఇందులో ఉన్నారు. ఈ సినిమాకి అనుకున్న బడ్జెట్ ఒకటి, అయ్యింది మరొకటి. నిర్మాత టి.జి. విశ్వప్రసాద్ దేనికీ వెనకాడకుండా సినిమాని పూర్తి చేశారు. ఆయన నిజమైన హీరో ఈ సినిమాకు. ఇలాంటి సినిమాకి ఆ స్థాయిలో రీరికార్డింగ్ చేసే సంగీత దర్శకుడు తమన్ ఒక్కరే అనిపించింది. మారుతి మూడేళ్ల కష్టం, బాధ్యత ఈ సినిమా. సంక్రాంతికి చాలా సినిమాలొస్తున్నాయి. ఎప్పటికైనా సీనియర్లు సీనియర్లే. వాళ్ల నుంచే మేం నేర్చుకున్నాం' అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'కథానాయకుడు ప్రభాస్, నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ కారణంగానే ఈ సినిమాతో ఇంత దూరం ప్రయాణించాం. నిర్మాత జీవితాన్ని పెట్టారు ఈ సినిమాకి. థియేటర్‌కి వచ్చినవాళ్లకు మేం ఎంత కష్టపడ్డామో కనిపిస్తుంది. రాజమౌళికి ప్రతి దర్శకుడు చాలా రుణపడి ఉంటారు. పాన్ ఇండియా స్థాయిలో ఎంతోమందికి గుర్తింపు దక్కిందంటే కారణం ఆయనే. నిజంగా ఇది తెలుగు చిత్ర పరిశ్రమకు స్వర్ణయుగం. నా స్థాయిలో నేను సినిమాలు చేస్తుంటే, నువ్వు ఇంకా పైకి ఎదగాలి అంటూ ఈ అవకాశం ఇచ్చారు ప్రభాస్. ఆయన నటించి వెళ్లడం కాకుండా ఈ సినిమాకోసం జీవితాన్ని పెట్టారు. అన్ని భాషల్లోనూ ఈ సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుంది. ఈ కథలో అంత శక్తి ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ నటనను ఒక ప్రేక్షకుడిగా చూస్తూ నాకే కన్నీళ్లొచ్చాయి' అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ వేడుకకి ప్రధాన ఆకర్షణ ప్రభాస్ హెయిర్ స్టైలే. ఆయన పిలకతో ఈ వేడుకకు హాజరయ్యారు. ఏదో ఒక రోజు అందరూ షాక్ అయ్యేలా వేదికపై వినోదం పంచుతానని ఆయన చెప్పడంతో అభిమానులంతా కేరింతలు కొట్టారు. వేడుకలో ప్రభాస్ పెళ్లి చేసుకునే అమ్మాయికి ఎలాంటి క్వాలిటీస్ ఉండాలి అంటూ ఓ అభిమాని ప్లకార్డు ప్రదర్శించారు. 'అది తెలియకే ఇంకా పెళ్లిచేసుకోలేదు' అంటూ ఫన్నీగా సమాధానమిచ్చారు ప్రభాస్.



### ప్రభాస్ మ్యాష్ అప్ వీడియో విడుదల

ప్రభాస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అభిమానులు ఉన్న విషయం తెలిసిందే. ఆయన సినిమా వస్తుందంటే ఇండస్ట్రీలో సందడి నెలకొంటుంది. మరికొన్ని రోజుల్లో ఆయన 'ది రాజాసాబ్'తో పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. దీని ప్రచారంలో భాగంగా చిత్రబృందం ఓ మ్యాష్‌అప్ వీడియో విడుదల చేసింది. ప్రభాస్ కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి ఆయన సినిమాలు విడుదలైనప్పుడు అభిమానుల చేసే సందడి, ఇండస్ట్రీలో ఉన్న సినీ ప్రముఖులు ఆయన గురించి పంచుకున్న మాటలు ఆ వీడియోలో చూపించారు. గతంలో ప్రభాస్ అభిమానులను ఉద్దేశించి చెప్పిన కొన్ని మాటలు ఎమోషనల్‌గా ఉన్నాయి. తనకు ఒక్క అభిమాని ఉన్నా చాలు అనుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు ఆయన చెప్పారు.

## మార్చి 6న అల్లు శిరీష్ వివాహం

నటుడు అల్లు శిరీష్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. తన ప్రియురాలు నయనికతో అక్టోబర్‌లో నిశ్చితార్థం ఘనంగా జరిగింది. తాజాగా శిరీష్ తన పెళ్లి తేదీని వెల్లడిరచారు. వచ్చే ఏడాది మార్చి 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. ఇన్‌స్టాలో ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అయాన్, అర్హలతో రీల్ చేస్తూ అధికారికంగా చెప్పారు. 'బాబాయ్ సంగీత్ ఎప్పుడు ఉంటుంది' అని వాళ్లు అడగ్గా.. 'మనం దక్షిణాది వాళ్లం.. అలాంటివి చేసుకోం' అని శిరీష్ అన్నారు. అయితే, పెళ్లి ఎక్కడ జరుగుతుంది అనే విషయాన్ని మాత్రం వెల్లడిరచలేదు. ఇక అల్లు అర్జున్ ` స్నేహారెడ్డి వివాహం కూడా 2011లో మార్చి 6నే జరగడం విశేషం.శిరీష్`నయనికల ప్రేమ ప్రయాణం వరుణ్` లావణ్యల పెళ్లి సమయంలో ప్రారంభమైంది. వీరి పెళ్లికి నటుడు నితిన్ సతీమణి షాలినితో కలిసి హాజరయ్యారు. షాలినితో ఆమె స్నేహితురాలు నయనిక కూడా వచ్చారు. తొలిసారి ఆమెను అప్పుడే చూసినట్లు శిరీష్ తెలిపారు. ఆ పరిచయం స్నేహంగా మారి ఇద్దరి మధ్య ప్రేమ చిగురించినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు.



వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, డిసెంబర్ 29, 2025

# కొలిచిన వారికి కొంగు బంగారం..





- శ్రీ సంతోష లక్ష్మీ నరసింహ స్వామి
- న్యూశాయంపేటలో కొండపై స్వయంభూ పట్టాభిషేక రూపం
- నిత్యం భక్తులతో కిటకిట
- 30 న ముక్కోటి ఏకాదశి
- భక్తులకు ఉత్తర ద్వార దర్శనం

**వరంగల్ వాయిస్, న్యూశాయంపేట :** కొలిచివారికి కొంగు బంగారం.. శ్రీ సంతోష లక్ష్మీ నరసింహ స్వామి. గ్రేటర్ వరంగల్ పరిధి 31వ డివిజన్ న్యూశాయంపేటలోని కొండపై స్వయంభూగా వెలసిన శ్రీసంతోషలక్ష్మీ నరసింహాస్వామి క్షేత్రం నిత్యం భక్తులతో కిటకిటలాడుతుంది. భక్తులు కోరిన కోర్కెలను తీర్చే దేవుడిగా, ముడుపులు కడితే వరాలిచ్చే స్వామిగా నమ్మకం. కొన్ని వందల ఏళ్ల క్రితం స్వామివారు సతీసమేతంగా గుట్టలను చీల్చుకొని ప్రత్యక్షమై స్వయంభూగా వెలిసినట్లు స్థానికులు చెప్పుకుంటారు. స్వామివారి ముఖం ఈశాన్యవైపున అవతరించడంతో స్వామివారి చల్లనిచూపు భక్తులపై ఉన్నట్లు చెబుతున్నారు. భక్తులు కోరితే వరమిచ్చే స్వామి వారికి ముడుపులు కడితే వివాహం, ఉద్యోగం, చదువుల్లో మంచి ర్యాంకులు, వ్యాపార, వాణిజ్యంలో లాభసాటిగా ఉంటాయని భక్తుల నమ్మకం. గత కొన్ని ఏళ్లుగా దేవస్థానం డైరెక్టర్ ధర్మకర్త గ్రంది సత్యవతి సూర్యనారాయణ, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్ రావు, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సూర్యుడు ఉత్తరాయనానికి మారేముందు ధనుర్మాస శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి.. ముక్కోటి ఏకాదశిగా పిలుస్తారు. ఈరోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకుని ఉంటాయి. శ్రీమన్నారాయణుడిని ప్రీతికరమైన వైకుంఠంలో మూడు కోట్ల దేవతలు ఉత్తర ద్వారం గుండా దర్శించుకుంటారని పురణాలు చెబుతున్నాయి. హిందువులకు ఇది అతి పవిత్రమైనరోజు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైష్ణవిదేవాలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నారు.

### ఈశాన్యదిక్కున..

కొన్ని వందల ఏళ్ళ క్రితం శ్రీ లక్ష్మి నరసింహుడు గుట్టలను చీల్చుకొని స్వయంభూగా వెలిశాడు. నాటి నుంచి భక్తులు గుట్టపై పూజలు చేస్తున్నారు. గత మూడేళ్ల నుంచి ఎక్కువగా భక్తులు రావడం జరుగుతోంది. కొలిసినవారికి కొంగుబంగారం కావడం, ఈశాన్య దిక్కున ముఖంతో వెలిసి ఉండటంతో స్వామివారి చల్లని చూపు అందరిపై ఉంటుందని భక్తుల నమ్మకం. అలాగే స్వామికి ప్రతిరోజు నిత్యాభిషేకం, ప్రతి శనివారం గిరిప్రదక్షిణం, ప్రతి స్వాతి నక్షత్రానికి సుదర్శన నర్సింహహోమం, ప్రతి పౌర్ణమికి సత్యనారాయణ స్వామి వ్రతం, నిత్యం అభిషేకాలు, పూజలు జరుగుతుంటాయి. నర్సింహజయంతి వైకుంఠ ఏకాదశి, తొలి ఏకాదశి, ధనుర్మాసం, రథసప్తమి, గోదా కళ్యాణం పండుగలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. ఓరుగల్లుకే మణిహారంగా ఈ క్షేత్రం విరాజిల్లుతుందని భక్తులు అంటున్నారు.

### శ్రీసంతోష నరసింహాస్వామిగా ..

శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఎన్నో రూపాల్లో అంతట వెలిసినా.. న్యూశాయంపేట కొండలపై మాత్రం స్వామివారు సంతోష భరతమైనటువంటి రూపం ఉండటంతో స్వామి వారికి శ్రీ సంతోష లక్ష్మీనర్సింహస్వామిగా పేరు రావడం.. అదే పేరుతో భక్తులు కొలుస్తున్నారు. భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతాయనే బలమైన నమ్మకం ఉంది.

### 30 న వైకుంఠ ఏకాదశి...

ఉత్తరద్వారం నుంచి స్వామివారిని దర్శనం చేసుకొనుటకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్ రావు, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. భక్తులకు అన్నదానంతో పాటు తాగునీరు తదితర ఏర్పాట్లను చేస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి వైకుంఠ ద్వారం నుంచి స్వామివారిని ఉదయం 5 గంటల నుంచి దర్శించుకోవాలని సూచించారు.

### విశిష్ట కార్యక్రమాలు..

30 తేది మంగళవారం ఉదయం 5 గంటలకు శ్రీ సంతోష లక్ష్మీనృసింహస్వామి వారి ఉత్తర ద్వార దర్శనం, పల్లకి ఊరేగింపుతో గిరిప్రదక్షణను పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తుల సమక్షంలో నిర్వహించనున్నారు. విశేష సంఖ్యలో పుష్పాలు, తులసీదళాలతో శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణతో ప్రత్యేక అర్చనలు జరుగుతాయి. శ్రీ స్వామివారికి ప్రీతికరమైన యాలకుల మాలలు సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకులు తెలిపారు.

### అన్నం ముట్టరు:
### ఆలయ ధర్మకర్త గ్రంధి సత్యవతి

వైకుంఠ ఏకాదశి రోజున భక్తులు అన్నం ముట్టరు. ముర అనే రాక్షకుడు అన్నం రూపంలో ఉంటాడని విశ్వాసం. పురాణాల్లో తెలిపిన ఓకథ ప్రకారం బ్రహ్మదేవుడి తల నుంచి ఒక స్వేతబిందువు నేలమీదపడి రాక్షసరూపం దాల్చింది. ఆ రూపం ఓబ్రహ్మదేవా.. నాకు నివాసస్థలం చూపించు అని ప్రార్థించగా, ఏకాదశి రోజు మానవులు భుజించే అన్నంలో ప్రవేశించి వారి ఉదరాల్లో స్థానం ఏర్పర్చుకొమ్మని ఆ రాక్షస రూపానికి బ్రహ్మ వరమిచ్చాడు. అందుకే వైకుంఠ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువుకు షోడసేపచారాలతో ఆరాధించి ఉపవాసం పాటిస్తారు.



### ముక్కోటి వ్రతాల పుణ్యఫలం : ఆలయ అర్చకులు వెంకటరమణ చార్యులు

జగన్మోహన స్వామి ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని దేవాలయంలో భక్తులు దర్శనం చేసుకుంటే ముక్కోటి దేవతల పుణ్యఫలం లభిస్తుందని, కొలిచినవారికి కొంగు బంగారమై శ్రీ లక్ష్మీనరసింహుడు దీవిస్తాడని దర్శించుకున్నవారికి మోక్షం లభిస్తుందని ఆలయ అర్చకులు వెంకటరమణ చార్యులు, జగన్మోహన స్వామి అన్నారు. ముక్కోటి ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించడానికి 33 కోట్ల దేవతలు వేచి ఉంటారు. కనుక ఈ రోజున స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నట్లయితే కోటి ఏకాదశి ఉపవాసాల పుణ్య పలితాలు పొందగలమన్నారు. ముక్కోటి ఏకాదశికి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నామన్నారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, భక్తులకు క్యూలైన్ లు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ గోపురాలకు పరిసర ప్రాంతాలలో రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలాగే రంగవల్లులతో అలంకరిస్తున్నారన్నారు. ఆలయ ధర్మకర్త గ్రంథి సూర్యనారాయణ సత్యవతి, వేల్పుల మోహన్ రావు, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు ముక్కోటి ఏకాదశి కి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని అర్చకులు తెలిపారు.

## కుట్రతోనే కేసులు

### కార్పొరేటర్ భర్త జక్కుల వెంకటేశ్వర్లు

**వరంగల్ వాయిస్, బీమారం :** తనపై దాడి కేసు నమోదు చేయడం కుట్రలో భాగమేనని కార్పొరేటర్ భర్త జక్కుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కాలనీలో ప్రధాన కార్యదర్శి ఇంటి వరకు రోడ్డు పనులు వేయడం లేదన్న సమాచారంతో అక్కడికి వెళ్లిన తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి దుర్భాషలాడిన క్రమంలో చిన్న ఘర్షన చోటు చేసుకుందన్నారు. అయితే నియోజకవర్గ ఎమ్మెల్యే అనుచరులు కావాలనే రాజకీయంగా తనను అణగదొక్కడానికి భారీ స్కెచ్ వేశారని ఆరోపించారు. అభివృద్ధి కోసమే పార్టీ మారినట్లు ప్రకటించారు. అయితే తనను డివిజన్ అభివృద్ధికోసం కాకుండా సొంత ప్రయోజనాల కోసం పనిచేయాలని ఒత్తిడి చేస్తున్నారని, మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేయించినప్పటికీ అభివృద్ధి జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. నక్షత్ర కాలనీని అనుకుని ఉన్న వెంచర్ లో భూ వివాదం ఉన్న ప్లాట్ లో ఎమ్మెల్యే అనుచరులు చొరబడి అక్రమంగా వారిని బెదిరించి రూ.3 కోట్ల భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో తను సహకరించనందునే నానా రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని, కేసులు నమోదు చేసే ప్రయత్నంతో ఇలాంటి కేసులలో ఇరికించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి, ప్రజల అభివృద్ధి కోసం పాటుపడే తనను ఇలాంటి కేసులు ఏమి చేయలేవని ప్రజలందరికీ అన్ని విషయాలు అర్థం అవుతున్నాయని జక్కుల వెంకటేశ్వర్లు వివరించారు.



## 3.5 కేజీల శిశువు జననం

సంగెం మండలం కుంటపల్లి గ్రామానికి చెందిన పెంతల నాగరాజు భార్య సింధు కాన్పు కోసం వరంగల్ లోని సీకేఎం ఆస్పత్రిలో చేరింది. ఆమెకు సోమవారం శస్త్ర చికిత్స నిర్వహించగా 3.5 కేజీల బరువున్న బాలిక జన్మించింది. అయితే ఆమె కడుపులో సుమారు నాలుగు కేజీల కణితి ఉండడం డాక్టర్లను ఆశ్చర్యానికి గురి చేసింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి, సిస్టర్ సౌజన్య, జూడాల సంయుక్త ఆధ్వర్యంలో కణితిని తొలగించారు. ఈ కార్యక్రమంలో అనస్తీషియా విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ బేబి రాణి, డాక్టర్ రమేష్, డాక్టర్ సైఫ్, డాక్టర్ దీపిక, డాక్టర్ రహిమున్నీసాతోపాటు జూడాలు పాల్గొన్నారు.
– **వరంగల్ వాయిస్, కాశీబుగ్గ**

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

### గార్లకు చెందిన ఇద్దరు యువతుల దుర్మరణం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అమెరికాలోని కాలిఫోర్నియా ఘాట్ రోడ్డులో జరిగిన కారు ప్రమాదంలో ఇద్దరు తెలుగు యువతులు దుర్మరణం చెందారు. దీంతో రెండు కుంటుంబాల్లో విషాదం నెలకొంది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండంలో మీ సేవా కేంద్రం నిర్వాహకుడు నాగేశ్వరరావు కూతురు పులఖండం మేఘనారాణి (25), ముల్కనూరు ఉప సర్పంచ్ కోటేశ్వరరావు కూతురు కడియాల భావన (24) మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఎమ్మెస్ పూర్తిచేసి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. మేఘన, భావన సహా మొత్తం ఎనిమిది మంది స్నేహితులు రెండు కార్లలో కాలిఫోర్నియాలో టూర్‌కి బయల్దేరారు. ఈ క్రమంలో అలబామా హిల్స్ రోడ్డులో మలుపు వద్ద మేఘన, భావన ప్రయాణిస్తున్న కారు లోయలో పడింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యువతుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com